శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జూన్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. భక్తులతో తిరుమాఢవీధులు, క్యూలైన్లలో సందడి కనిపించింది. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.32,70,834 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

రామన్నపేట : దుబ్బాక ప్రాథమిక పాఠశాలలో మొక్కను నాటుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

రామన్నపేట, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. మండలంలోని దుబ్బాక గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాలలో జరుగుతున్న మంచినీరు, మరుగుదొడ్లు, మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. గ్రామంలో విరివిగా మొక్కలు నాటి భావితరాలకు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, ఏపీఓ వెంకన్న, నోడల్ అధికారి గవ్వ జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు ఉయ్యాల భిక్షం, ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల డబ్బు స్వాహాపై విచారణ

- బీపీఎంను సస్పెండ్ చేసిన తపాలా శాఖ అధికారులు

ఆత్మకూరు(ఎం) రాయిపల్లిలో ఉపాధి హామీ కూలీలను విచారణ చేస్తున్న తపాలా శాఖ అధికారులు

ఆత్మకూరు(ఎం), జూన్ 7 : మండలంలోని రాయిపల్లి గ్రామంలో బీపీఎం శివ ఫోర్జరీ సంతకాలు చేసి ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన వేతనాలు లక్షా 60వేల రూపాయలు స్వాహా చేశాడు. తమ వేతనాలు కాజేసిన బీపీఎంను సస్పెండ్ చేయాలని కూలీలు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. స్పందించిన తపాలా శాఖ అధికారులు శుక్రవారం రాయిపల్లి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఫోర్జరీ సంతకాలతో కూలీల వేతనాలు కాజేసినట్లు నిర్ధారణ కావడంతో బీపీఎం శివను సస్పెండ్ చేస్తున్నట్లు తపాలా శాఖ భువనగిరి సబ్ డివిజన్ ఇన్‌చార్జి సైదిరెడ్డి తెలిపారు. తాత్కాలికంగా కప్రాయపల్లి బీపీఎం సురేశ్‌ను రాయిపల్లి ఇన్‌చార్జి బీపీఎంగా నియమించినట్లు చెప్పారు. స్వాహా చేసిన డబ్బు రికవరీ చేసుకొని కూలీలకు అందించే విధంగా ఉపాధి కూలీల ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకొని పైఅధికారులకు నివేదిక అందజేశారు.

గంధమల్ల రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించాలి : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

ఆలేరు రూరల్, జూన్ 7 : గంధమల్ల రిజర్వాయర్ ద్వారా ఆలేరు ప్రాంతానికి తాగు, సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సాగునీరు లేక వేల ఎకరాల భూములను ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పూర్తి సమాచారం సేకరించి నియోజకవర్గంలోని 8మండలాలకు సాగు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, నాయకులు కనకయ్య, సత్తయ్య, ఆంజనేయులు, రవి, కిష్టయ్య, స్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

బొమ్మలరామారంలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ దేవ్‌సింగ్, అధికారులు

బొమ్మలరామారం, జూన్ 7 : నకిలీ విత్తనాలు, అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ డివిజనల్ సీడ్ స్క్వాడ్ బృందం అధికారి, భువనగిరి ఏడీఏ దేవ్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు చీకటిమామిడి, మర్యాల గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం ఇంటర్ డివిజనల్ సీడ్ స్క్వాడ్ బృందం అధికారులు తనిఖీ చేశారు. కొనుగోలు ఇన్వాయిస్‌లు, స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల షాంపిల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవ్‌సింగ్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను రోజువారీగా రాయాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరల కన్నా ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొన్నప్పుడు ఇన్వాయిస్, లాట్ నెంబర్లను సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓలు ఏకే ఖాన్, అంజని, పద్మ, ఏఎస్ఐ నర్సింహారెడ్డి, కానిస్టేబుల్ నవీన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి మాజీ ఎంపీ బడుగుల పరామర్శ

రామన్నపేట, జూన్ 7 : మండలంలోని శోభనాద్రిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు శ్రీకాంత్ శుక్రవారం మృతిచెందాడు. రాజ్య సభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ శుక్రవారం శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో యువజన విభాగం రాష్ట్ర నాయకుడు కాల్య శ్రవణ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ ముక్కాముల నరేందర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగుల రాఘవరెడ్డి, నాయకులు నర్సింహ, సత్తయ్య, భూపాల్, జంగయ్య ఉన్నారు.

గ్రూప్-1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు

- నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 7 : గ్రూప్-1 పరీక్షను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం విద్యుత్, మెడికల్, ఆర్టీసీ, పోలీసు, మున్సిపల్ అధికారులు, చీప్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. కేంద్రాల్లో పరీక్ష నిర్వహణను ఇన్విజిలేటర్లు జాగ్రత్తగా పరిశీలించాలని, సమయం పూర్తయ్యే వరకు ఎవరినీ బయటకు పంపకూడదని అన్నారు. పోలీసులు పరీక్ష కేంద్రాలు, చుట్టుపక్కల బందోబస్తు ఏర్పాట్లు చేస్తారని, 50 మంది అభ్యర్థులకు ఒక ఐడెంటిఫికేషన్ ఆఫీసర్‌ను నియమించామని చెప్పారు. పరీక్ష నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘిస్తే జిల్లా నోడల్ అధికారి, జిల్లా పోలీసు నోడల్ అధికారి, రీజినల్ కో ఆర్డినేటర్‌కు సమాచారం అందించడానికి అబ్జర్వర్లను కూడా నియమించామన్నారు. పరీక్ష పేపర్లను స్ట్రాంగ్ రూమ్ నుంచి కేంద్రాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా రూట్ అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులు పక్కాగా నిర్వర్తించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్లకు అనుమతి లేదని, ఎమర్జెన్సీ కోసం ఒక్క చీప్ సూపరింటెండెంట్‌కు మాత్రమే అనుమతి ఉన్నదని తెలిపారు. పరీక్ష రోజు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ కేంద్రాలను మూసివేసి ఉంచుతారని అన్నారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ పటిష్టమైన పోలీసు బందోబస్తు, పక్కాగా ట్రాఫిక్ నియంత్రణ ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పార్కింగ్ స్థలాలను గుర్తించామని, అభ్యర్థులు తమ వాహనాలను అక్కడే పార్కింగ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, బయోమెట్రిక్ విధానం సాఫీగా జరుగుతుందని అన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల చుట్టుపక్కల మైక్ శబ్దాలు లేకుండా చీఫ్ సూపరింటెండెంట్లు ముందు రోజే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈఓ కె.నారాయణ రెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ బాలాజీ, కలెక్టరేట్ విభాగం సూపరింటెండెంట్ పార్థసింహారెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలి

గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి 9నుంచి 10గంటల వరకు అనుమతి ఉంటుందని, 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు, హాల్‌టికెట్ డౌన్‌లోడ్ గురించి 8331997006, 8331997037 జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ డెస్క్‌ను సంప్రదించాలని, హాల్ టికెట్‌ను http://www.tspsc.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ముందు, బయటికి పోయే ముందు బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించిన క్రీడాకారులు

భువనగిరి అర్బన్, జూన్ 7 : హనుమకొండ జిల్లాలో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల యూత్ చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్‌లో 4 గోల్డ్ మెడల్స్, 8 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో నిలిచారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ తెలిపారు. రాష్ట్రస్థాయి పథకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

పథకాలు సాధించిన క్రీడాకారులు

మల్లిక (10వేల మీటర్లు) ప్రథమ, (5వేల మీటర్లు) ద్వితీయ, సునీల్ (5వేల మీటర్లు) సిల్వర్, (1500 మీటర్లు) సిల్వర్, సచిన్ డిస్కస్‌త్రో ప్రథమ, చంద్రశేఖర్ ప్రసాద్ ద్వితీయ, నిఖిత 400 మీ., 400 హర్డిల్స్‌లో ప్రథమ, ప్రదీప్ హ్యామర్‌త్రో ద్వితీయ, బుచ్చమ్మ షాట్ పుట్ ద్వితీయ, ఉషారాణి 1500 మీ. తృతీయ, పవన్‌రాజ్ 150 మీ. ప్రథమ, రాహుల్ డిస్కస్‌త్రో ద్వితీయ స్థానంలో పథకాలు సాధించారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు (ఎం), జూన్ 7 : మండలంలోని టి.రేపాకలో గీత కార్మికుడైన మూల ఆది నారాయణగౌడ్ ఏడు నెలల క్రితం తాటిచెట్టు పైనుంచి జారి పడి మృతి చెందాడు.

మృతుడికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుంచి రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. శుక్రవారం అతని కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, గడ్డమీది రమేశ్‌గౌడ్, యాస అంజిరెడ్డి, శ్రీహరి, మల్లయ్య, నాగరాజు, సోమరాజు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

బొమ్మలరామారం, జూన్ 7 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ గూడె బాలనర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ 1010 రకం 25 కిలోల బస్తాకు రూ.987.50, జేజేలు 25కిలోల బ్యాగుకు రూ.987.50, కేఎన్ఎం 118 రకం 25కిలోల బ్యాగు రూ.987.50, కేఎన్ఎం 1638 రకం 25 కిలోల బ్యాగు రూ.995, కందులు 4కిలోలకు 599 రూపాయలకు విక్రయిస్తున్నామని తెలిపారు. విత్తనాలు అవసరమున్న రైతులు ఆధార్, పాస్‌బుస్ జిరాక్స్ తీసుకు రావాలని సూచించారు.

ఇసుక రవాణా అడ్డగింత

రాజాపేట, జూన్ 7 : మండలంలోని బేగంపేట వాగులో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం కోసం కాల్వపల్లి వాగు నుంచి అనుమతులు లేకుండా జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా కాల్వపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. వాగులో నుంచి ఇసుక తరలిస్తే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతాయన్నారు. ఈ విషయంపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించగా.. పోలీసులు వచ్చి ఇసుక రవాణాను నిలిపివేశారు. ఇసుక తరలింపునకు అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు తెలిపారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి : ఎంపీడీఓ

ఆలేరు రూరల్, జూన్ 7 : బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ సత్యానంద్‌ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఆదర్శ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి లక్ష్మి, ఏపీఎం మీనా, ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

తుర్కపల్లి : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి లింగారెడ్డి

చౌటుప్పల్ : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజు

తుర్కపల్లి, జూన్ 7 : ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చైర్మన్లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి పెసరు లింగారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థుల దగ్గరకు వెళ్లి ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ సర్కారు బడుల్లో చేరాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల విద్యాబోధన ఉంటుందని, ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మంజుల, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరవిందరాయుడు అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

చౌటుప్పల్ : సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తున్నదని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లల్లో ఉచిత విద్యతోపాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, పద్మ, జహంగీర్‌బీ, నర్సింగ్‌రావు, సత్తయ్య, బి.శ్రీరాము లు, వెంకటయ్య, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చీకటిమామిడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోమటిరెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సర్కారు బడిలో సౌకర్యాల గురించి గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, చంద్రకళ, ఏఏపీసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, సీఆర్పీ జహంగీర్, అంగన్‌వాడీ టీచర్ కల్పన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి కాంత్, శ్రీనివాస్‌రెడ్డి, సంధ్యారాణి, అచ్చయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టణంలోని వడ్డెర కాలనీ, అంగడి బజార్, సుందరయ్య కాలనీలో విద్యార్థులతో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఐదేండ్లు పైబడిన విద్యార్థులను పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌజన్య, లలిత, జ్యోతి పాల్గొన్నారు.

తుక్కాపురంలో దొంగల బీభత్సం

- రెండు ఇండ్లల్లో చోరీ.. ఆభరణాలు, నగదు అపహరణ

తుక్కాపురంలో దొంగలు బయట పడేసిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 7 : మండలంలోని తుక్కాపురంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు ఇండ్లల్లో చోరీలకు పాల్పడి బంగారం, వెండి ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన గోపగాని నవీన్, జనగాం చంద్రశేఖర్ ఇండ్లల్లో గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి చోరీలకు పాల్పడ్డారు. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రించగా.. వెనుక డోరు నుంచి వచ్చిన దుండగులు బీరువాను ఇంట్లో నుంచి బయటకు తీసుకువెళ్లి అందులోని 22 తులాల వెండి పట్టా గొలుసులు, తులం బంగారు చెవికమ్మలు, 2తులాల గుండ్లతోపాటు 25వేల నగదును అపహరించుకుపోయారు. అనంతరం నవీన్ ఇంట్లో చొరబడి ఆయన భార్య ప్రసన్న మెడలోని 4తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్తుండగా.. బాధితురాలు కేకలు వేయడంతో దుండగులు రెండు వరుస పుస్తెలతాడులో ఒక వరుస ఉన్న ఒకటిన్నర తులాల తాడును లాక్కొని పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలోని బాధితుల ఇండ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కాగా, ఈ నెల 4న అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన జనగాం రవి ఇంట్లో దుండగులు 30తులాల వెండి కాళ్ల కడియాలు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు.

ప్రజలు బంగారు నగలతో ఆరుబయట నిద్రించవద్దని, రాత్రి సమయాల్లో గడియ వేసుకోవాలని పోలీసులు సూచించారు. కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా కనిపిస్తే 8712662472, 8712662473 నెంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలన్నారు.

స్టోన్ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తలో ఫిర్యాదు

మానవ హక్కుల కమిషన్‌కు చేసిన ఫిర్యాదు ప్రతిని చూపుతున్న ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ జంగయ్య

బొమ్మలరామారం, జూన్ 7 : మండలంలోని పలు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్టోన్ క్రషర్స్‌పై, పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ మైలారం జంగయ్య శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టోన్ క్రషర్స్ వల్ల ఇబ్బందులు పడిన ప్రజలు ఉద్యమించినా.. మైనింగ్, పొల్యూషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. క్రషర్స్ వల్ల పగ్రెలు పట్టిన ఇండ్లకు, బ్లాస్టింగ్ దాటికి పూడిపోయిన రైతుల బోరు బావులకు నష్ట పరిహారం అందేవరకు పోరాటం ఆపబోమని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ నాయకులు వట్టిపల్లి సుదర్శన్, ఊట్ల రమేశ్, నర్సింహ, సుదర్శన్, ఆశయ్య, రాంబాబు, భిక్షపతి, యాదగిరి, రవి, ప్రవీణ్, సత్యనారాయణ, స్వామి, ప్రభాకర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

సాధారణ డెలివరీలను మెరుగుపరుచాలి : డిప్యూటీ డీఎంహెచ్ఓ

పీహెచ్‌సీ డాక్టర్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని

మోటకొండూరు, జూన్ 7 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పోర్టల్‌లో డాటాను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ డెలివరీలను మెరుగుపరుచాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి విజయ్, మోజెస్, సీహెచ్ఓ నగేశ్, హెచ్ఈఓ నర్సయ్య, సిబ్బంది కృష్ణారెడ్డి, సుగుణ పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి

- జిల్లా అదనపు న్యాయమూర్తి శ్యాం శ్రీ

న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్, జూన్ 7 : కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్యాం శ్రీ అన్నారు. శుక్రవారం పదవీ బాధ్యతల స్వీకారం సందర్భంగా న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ఆమెను ఘనంగా సన్మానించింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. న్యాయస్థానంలో మౌలిక సదుపాయాల ఏర్పాటు, సిబ్బంది కొరత, ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాముల రామిరెడ్డి, జక్కుల వీరయ్య, న్యాయవాదులు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రావు, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, రవి కుమార్, రేణుకాదేవి, రమాదేవి, శ్రీలక్ష్మి, చల్లా కృష్ణయ్య, సైదులు, నారాయణరెడ్డి, నగేశ్, రాథోడ్, సురేశ్, వెంకటేశ్వర్లు, సైదాహుస్సేన్, సురేశ్‌నాయక్, శంకర్‌నాయక్, వెంకటేశ్‌నాయక్, రమణారెడ్డి పాల్గొన్నారు.

కండక్టర్‌పై దాడి చేసినందుకు 3నెలల జైలు శిక్ష

రామన్నపేట, జూన్ 7 : విధుల్లో ఉన్న ఆర్టీసీ కండక